అసంపూర్తిగా బ్రిడ్జి నిర్మాణం

- అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- మూడేళ్ల క్రితం రూ.1. 26కోట్లు మంజూరు
- రూ.56లక్షల పని జరిగినా బిల్లు రాలే!
- స్పందించని అధికారులు



ప్రమాదకరంగా ఉన్న తాత్కాలిక రహదారి

వీపనగండ్ల: మండల కేంద్రం నుంచి పెబ్బేరు పట్టణానికి వెళ్లే ప్రధాన రహదారిలో గోవర్ధనగిరి గ్రామ సమీపంలో మూడేళ్ల క్రితం బ్రిడ్జి నిర్మాణం ప్రారంభించారు. ఇప్పటికీ బ్రిడ్జి పూర్తికాకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయాలని ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో వాహనదారులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయాని ప్రజలు కోరుతున్నారు.

రూ.1.26 కోట్లు మంజూరు

మండలంలోని గ్రామాల ప్రజలకు మెరుగైన రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో గోవర్ధనగిరి గ్రామ సమీపంలో బ్రిడ్జి నిర్మాణం కోసం అధికారులు రూ.కోటి 26 లక్షలు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. మూడేళ్లు గడిచినా నిర్మాణ పనులు పూర్తి చేయలేదు. బ్రిడ్జి సమీపంలో తాత్కాలికంగా వేసిన మట్టి రోడ్డు వర్షాకాలం వర్షాలకు బురదమయంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. రూ.65 లక్షల పను



గోవర్ధనగిరి వద్ద అసంపూర్తిగా ఉన్న వంతెన పనులు

లు కాంట్రాక్టర్ పూర్తి చేసినా ఎంబీ రికార్డు చేసిన అధికారులు నేటికీ ఒక్క పైసాకూడా చెల్లించకపోవడంతో పనులను వదిలేసి కాంట్రాక్టర్ వెళ్లిపోయాడు.

వర్షాకాలంలో ఇబ్బందులు..

సమీప గ్రామాల ప్రజలతో పాటు పలువురు రైతులు తాత్కాలికంగా వేసిన రోడ్డు పాడవడంతో ఇబ్బందులకు గురి కావడమే కాకుండా ప్రమాదాల బారిన పడే పరిస్థితులు నెలకొన్నాయి. అధికారులకు ఎన్నోసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన చెందుతున్నారు. కొంత వరకు నిర్మించిన బ్రిడ్జి కూడా శిథిలావస్థకు చేరుతోందని పలువురు పేర్కొంటున్నారు. ఉన్నతాధికారులు బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయించాలని కోరుతున్నారు.

ప్రయాణం ప్రమాదకరం..



తాత్కాలిక రోడ్డుపై రాత్రి సమయంలో ప్రయాణించాలంటే భయపడాల్సి వస్తోంది. పెబ్బేరు పట్టణానికి వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లే రైతులు ప్రమాదాలకు గురైన సంఘటనలున్నాయి. బ్రిడ్జి నిర్మాణం త్వరగా పూర్తి చేయించాలి.

– భగవంత్, రైతు, గోపల్‌దిన్నె

పనులు పూర్తి చేయించాలి..



బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రత్యేక నిధులు కేటాయించి పనులను వెంటనే పూర్తి చేయించాలి. లేకుంటే మండలంలోని పలు గ్రామాల రైతులను సమీకరించి ఆందోళనలు నిర్వహిస్తాం. మండల కేంద్రానికి ప్రధాన రోడ్డు కావడంతో ప్రజలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– బాల్‌రెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి, వీపనగండ్ల

క్లుప్తంగా

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



ఆత్మకూర్: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని కమిషనర్ చికినే శశిధర్ అన్నారు. బుధవారం 100 రోజుల ప్రణాళికలో భాగంగా ప్రత్యేక పారుశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. వార్డుల్లో ముమ్మరంగా పారుశుద్ధ్య పనులు చేపట్టారు. అనంతరం కుక్కకాటుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దోమల నివారణ, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడుకేటర్ సురేందర్‌గౌడ్, వార్డుల అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పీర్ల చావిడి వద్ద పారిశుద్ధ్య పనులు

అమరచింత: మొహర్రం నెల సమీపిస్తుండటంతో పట్టణంలోని పీర్ల మసీదుల వద్ద మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్యం పనులు చేపట్టారు. ఆయా వార్డులలోని మురుగు కాల్వల్లో పేరుకు పోయిన పూడికను తొలగించడమే కాకుండా రహదారులను శుభ్రపరుస్తూ, తడి పొడి చెత్తను తరలించే వాహనాల్లో వేయాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు మున్సిపల్ మేనేజర్ యూసుఫ్ తెలిపారు.

పాఠశాలకు టీవీ వితరణ



వనపర్తి రూరల్: శ్రీరంగాపురం మండలంలోని కంబాళాపురం గ్రామంలోని యూపీఎస్ పాఠశాలకు ఉపాధ్యాయుడు శివశంకర్ యాదవ్ రూ.10 వేల విలువైన ఎల్‌ఈడీ టీవీని ఎచ్ఎం మురళీధర్‌కు బుధవారం అందజేశారు. పాఠశాలకు టీవీని బహూకరించిన ఉపాధ్యాయులు శివశంకర్‌ను ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ విష్ణువర్ధన్ నాయుడు, బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

కొత్తకోట రూరల్: త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి కార్యకర్త, నాయకుడు పనిచేయాలని బీజేపీ కిసాన్‌మోర్చ జిల్లా అధ్యక్షులు దాబా శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రచ్చబండ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని నిర్వేన్, పామాపురం గ్రామాల్లో బీజేపీ మండల అధ్యక్షులు చీర్ల నర్సింహ, జిల్లా నాయకులు భరత్‌భూషణ్, మాధవరెడ్డిలు పర్యటించారు. ఆయా గ్రామాల్లోని కార్యకర్తలకు స్థానిక ఎన్నికలపై దిశా నిర్దేశం చేశారు.

చేతివృత్తుల ఉత్పత్తుల ప్రదర్శన

వనపర్తి: హైదరాబాద్‌లోని సచివాలయం సమీపంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం పక్కన మైదానంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో కుమ్మరి, చేనేత, మేదరి, వడ్రంగి, పూసల తదితర వృత్తి కళాకారులు తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకం ఈ నెల 29 వరకు కొనసాగుతుందని జిల్లా బీసీ అభివృద్ధిశాఖ అధికారి ఆర్.ఇందిర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు పాల్గొని ఉత్పత్తులు కొనుగోలు చేసి బీసీ కళాకారులను ప్రోత్సహించాలని పేర్కొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన

పాన్‌గల్: చిన్నారులకు, గర్భిణులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు తీసుకునేలా అవగాహన కల్పిస్తూ వారిని చైతన్యం చేయాలని సీహెచ్ఓ రామయ్య వైద్య సిబ్బందికి సూచించారు. బుధవారం మండలంలోని చింతకుంట సబ్‌సెంటర్‌లో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టీకాలను సకాలంలో వేయించుకోవడంతో వ్యాధి నిరోధక శక్తి పెరిగి రక్షణ పొందవచ్చన్నారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు

వనపర్తి రూరల్: పెద్దగుమ్మడంలో వ్యవసాయ పొలంలో మంగళవారం రాత్రి గుర్తుతెయని వ్యక్తులు గుప్త నిధుల కోసం తవ్వకాలు చేసిన సంఘటన చోటుచేసుకుంది. దీంతో యజమాని బొల్లి చంద్రశేఖర్ పెబ్బేరు పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ యుగేంధర్‌రెడ్డి కథనం ప్రకారం.. పెబ్బేరు మండలంలోని పెద్దగుమ్మడం గ్రామానికి చెందిన బొల్లి చంద్రశేఖర్ పొలంలో జేసీబీతో తవ్వకాలు చేస్తుండడం చూసిన గ్రామస్తులు అరవగా అక్కడి నుంచి పారిపోయారు. ధరూర్ మండలానికి చెందిన తిమ్మారెడ్డి జేసీబీ డ్రైవర్ ఉన్నాడు. అతడిని పట్టు కొని పొలం యజమానికి సమాచారం ఇచ్చారు. అతను అక్కడికొచ్చి డ్రైవర్‌ను విచారించ గా చిన్న గుమ్మడంకు చెందిన శేఖర్ రెడ్డి మరి కొంత మందితో కలసి గుప్తనిధుల కోసం ముగ్గువేసి, నిమ్మకాయలు, టెంకాయలు, పూలు, కుంకుమ్మ, పసుపుతో క్షుద్రపూజలు చేసి జేసీబీతో గుంత తవ్వారని డ్రైవర్ చెప్పాడని బాధితుడు ఫిర్యాదు లో పేర్కొన్నారు. రైతు ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలి

- విద్యార్థుల సంఖ్యను పెంచేలా బోధన సాగాలి
- 10వ తరగతి విద్యార్థులకు గణితం బోధించిన కలెక్టర్
- పాన్‌గల్ మండలంలో కలెక్టర్ సుడిగాలి పర్యటన



పాన్‌గల్‌లో పదో తరగతి విద్యార్థులకు గణితం బోధిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

పాన్‌గల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచేలా బోధన సాగిస్తూ ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం మండల కేంద్రం పాన్‌గల్‌లోని ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలను సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రంలో నూతనంగా చేరిన చిన్నారులకు కలెక్టర్ అక్షరాభ్యాసం చేయించారు. పాన్‌గల్ ప్రాథమిక పాఠశాల్లో 105 మంది విద్యార్థులు ఉండటం, ఈ ఏడాది 57 మంది విద్యార్థులు ప్రవేశం పొందడం, ఉపాధ్యాయులు అంకితభావంతో బోధన చేయడంతో మంచి ఫలితాలు వస్తాయని కలెక్టర్ విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు.

లెక్కల మాస్టర్‌గా కలెక్టర్..

పాన్‌గల్ ఉన్నత పాఠశాలలో 10 తరగతి విద్యార్థులకు కలెక్టర్ గణితం బోధించి లెక్కల మాస్టర్‌గా మారారు. డిజిటల్ బోర్డుపై విద్యార్థులకు గణితం బోధించారు. లెక్కలు విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన చేసి పలుసూత్రాలు, సులువు పద్ధతిలో చేసే విధానం గురించి వివరించారు.

ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవాలి

మండలంలో పైలెట్ గ్రామంగా ఎంపిక చేసిన మాధరావుపల్లి గ్రామాన్ని సందర్శించి ఇందిరమ్మ ఇళ్లను కలెక్టర్ పరిశీలించారు. గ్రామానికి 57 ఇళ్లు మంజూరైతే అందులో 36 ఇళ్లకు మార్కింగ్ చేశారని, 17 ఇళ్లు స్లాబ్ వరకు వచ్చాయని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఇళ్లు నిర్మించుకొని లబ్ధిదారులను రద్దు చేసి అర్హత ఉన్న లబ్ధిదారులకు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈఓ అబ్దుల్ ఘనీ, డీఆర్‌డీఓ ఉమాదేవి, జిల్లా సంక్షేమ అధికారిణి సుధారాణి, తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి, ఎంపీడీఓ గోవింద్‌రావు, ఎంఈఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చాలి

వనపర్తి: జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జూన్ 20 నుంచి 26 వరకు జిల్లాలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగం, నిర్మూలనలో భాగంగా కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా ఎస్పీ రావుల గిరిధర్‌తో కలిసి డ్రగ్స్ నిర్మూలన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా సమాజంలోని ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలని సూచించారు. గురువారం ఉదయం 7గంటలకు స్థానిక బాలుర జూనియర్ కళాశాల మైదానం నుంచి పాలిటెక్నిక్ కళాశాల వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



గోపాల్‌పేట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం, సౌకర్యాలు అందించాలని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. బుధవారం రాష్ట్ర బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ పిలుపు మేరకు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, లక్ష్మణ్‌గౌడ్, మన్సూర్, శివప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి



గోపాల్‌పేట: ప్రభుత్వ బడిలో ఉత్తమ ఉపాధ్యాయులు ఉంటారని, విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని ఎంఈఓ ప్రభాకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏదుల, గోపాల్‌పేట మండలాల ఉపాధ్యాయులకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని సూచించారు. ప్రొఫెసర్ శివప్రసాద్ మాట్లాడుతూ స్వేచ్ఛపూరిత వాతావరణంలో విద్యార్థులకు విద్యాబోధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు రాందేవ్‌రెడ్డి, ఎంఆర్సీ సిబ్బంది చంద్రశేఖర్, మోహన్, శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

పఠనాసక్తిని పెంపొందించాలి



ఖిల్లాఘనపురం: విద్యార్థుల్లో పఠణాసక్తిని పెంచేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని ఎంఈఓ జయశంకర్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంఆర్సీ దగ్గర మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల హెచ్ఎంలకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు అన్ని పుస్తకాలు, ఉన్నత పాఠశాలలకు హిందీ పుస్తకాలు, నోట్ బుక్కులు, ఒక జత యూనిఫాంలు హెచ్ఎంలకు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని పాఠశాలల హెచ్ఎంలు, ఎంఆర్సీ అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర కార్యదర్శిగా బండారు కుమారస్వామి

వనపర్తిటౌన్: మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కుమారస్వామి నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారాయణ కుమారస్వామిని శాలువాతో ఘనంగా సన్మానించారు. మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కమిటీలో పట్టణానికి చెందిన కుమారస్వామి రాష్ట్ర బాధ్యతలు చేపట్టడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా నాయకలు పాల్గొన్నారు

శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి



పాఠశాలలో మ్యాజిక్ చేసి చూపిస్తున్న ఆదామ్‌రాజు

వనపర్తి రూరల్: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవార్చు కోవాలని విజ్ఞానదర్శిని రాష్ట్ర అధ్యక్షులు ఆదామ్‌రాజు అన్నారు. బుధవారం పెబ్బేరు మండలంలోని యాపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్, మూఢనమ్మకాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మూఢ విశ్వాసాలతో మనుషులు మానసిక రోగులుగా తయారైనట్లు తెలిపారు. ఏం చేస్తారో తెలియని పద్ధతిలో సొంత బిడ్డలనే చంపుకునే స్థితిలోకి వెళ్లారన్నారు. మంత్రాలు, చేతబడి, భాణమతి వంటివి అన్ని మూఢ నమ్మకాలన్నారు. స్వార్థ లాభాల కోసం సమాజాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. ఎచ్ఎం శంకర్‌గౌడ్, ఉపాధ్యాయులు మైనుద్దీన్, వెంకటేశ్వర్లు, ఈశ్వర్‌రెడ్డి, ఇందిరమ్మ, రమేష్, ఆంజనేయులు, శివాని, గ్రామస్తులు నరేందర్‌రెడ్డి, స్వరాజ్యం, బాబురెడ్డి, భీముడు, శ్యామ్, దామోదర్, శివారెడ్డి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం త్వరగా ప్రారంభించాలి



చిట్యాల తూర్పుతండాలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాఘవ



దేవరపల్లిలో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓలు శ్రీపాద్, చెన్నమ్మ

వనపర్తి రూరల్: మండలంలోని చిట్యాల తూర్పు తండాలో నిర్మాణం జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్లను బుధవారం ఎంపీడీఓ రాఘవ, పంచాయతీ కార్యదర్శి సుస్మీత పరిశీలించారు. మిగతా లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం త్వరగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. అనంతరం గ్రామంలో నర్సరీని, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. వనమహోత్సవ కార్యక్రమానికి పెద్ద మొక్కలు అందుబాటులో ఉంచాలని కార్యదర్శికి సూచించారు. అంగన్‌వాడీ కేంద్రానికి పిల్లలు సక్రమంగా హాజరయ్యేలా చూడాలని టీచర్‌కు సూచించారు. ముభిద్, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇళ్ల నిర్మాణం

ఆత్మకూర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అవకతవకలు లేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని ఎంపీడీఓలు శ్రీపాద్, చెన్నమ్మ, ఎంపీఓలు శ్రీరాంరెడ్డి, నరసింహయ్య అన్నారు. ఆత్మకూర్ మండలంలోని దేవరపల్లిలో అమరచింత, ఆత్మకూర్ కార్యదర్శులకు, మున్సిపాలిటీ వార్డుల అధికారులకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా అమావాస్య పూజలు



మర్రికుంట ఆలయంలో స్వామివారికి పూజలు చేస్తున్న భక్తులు



పెబ్బేరులో భక్తాంజనేయస్వామి ఆలయంలో..



అమరచింత శివచౌడేశ్వరి ఆలయంలో..

వనపర్తి రూరల్: మండలంలోని అచ్యుతాపురం గ్రామంలోని గుంటి పంచముఖి ఆంజనేయస్వామి, చిమనగుంటపల్లిలో శ్రీలక్ష్మి నరసింహస్వామి, మర్రికుంటలో ఆంజనేయస్వామి ఆలయం, పెబ్బేరు మండలంలోని శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయంలో బుధవారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయాల దగ్గర భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

అమరచింత: అమవాస్యను పురష్కరించుకుని మండలంలోని చంద్రగడ్ కోటపై వెలసిన రామలింగేశ్వర ఆలయానికి భక్తులు వెళ్లి పూజలు నిర్వహించారు. పట్టణంలోని శివచౌడేశ్వరి ఆలయం, శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నాగల్ కడ్మూర్‌లోని శ్రీదేవేంద్రాచార్యుల మఠంలో అమావాస్య పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

అన్నదానం.. మహాదానం



ఖిల్లాఘనపురం వీరన్న గుట్టదగ్గర మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డిని సన్మానిస్తున్న నిర్వాహకులు

ఖిల్లాఘనపురం: సమాజంలో పదిమందికి అన్నదానం చేయడం మహా దానమని వ్యవసాయ శాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని వీరన్నగుట్టపై వెలిసిన శ్రీ ఘనలింగేశ్వర భద్రకాళి సమేత వీరభద్రస్వామి దేవాలయంలో అమావాస్యపూజలో భక్తులతో పాటుగా ఆయన పాల్గొన్నారు. దేవాలయం దగ్గర నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి రూ.20 వేలు నిర్వాహకులు కమ్మరి గోపికి అందజేశారు. భక్తులతో కలిసి భోజనం చేశారు. దేవాలయం దగ్గర ప్రతి నెల అమావాస్య రోజున కమ్మరి గోపి దాతల సహకారం, గ్రామస్తులు, యువకుల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమాన్ని కొనసాగించేందుకు ప్రతిఒక్కరు సహకారం అందించాలని కోరారు. అనంతరం నిర్వాహకులు, గ్రామస్తులు మాజీ మంత్రిని శా లువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఖిల్లాఘనపురం పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నదాన కార్యక్రమానికి సహకారం అందించారు.

శాంతియుత సమాజమే పోలీసుల లక్ష్యం



బలిజపల్లి, జంగమాయపల్లి గ్రామాల్లో కవాతు నిర్వహిస్తున్న ఆర్ఏఎఫ్ జవాన్లు

కొత్తకోట రూరల్: శాంతియుత సమాజమే లక్ష్యంగా పోలీసు వ్యవస్థ పనిచేస్తోందని పెద్దమందడి ఎస్ఐ శివకుమార్ అన్నారు. జిల్లా ఎస్పీ రావులగిరిధర్ ఆదేశానుసారం పెద్దమందడి మండలంలోని బలిజపల్లి, జంగమాయపల్లి గ్రామాల్లో రాపిడ్ యాక్షన్ ఫోర్స్(ఆర్ఏఎఫ్)తో కవాతు నిర్వహించినట్టు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడు తూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో పాటు శాంతియుతంగా ఎన్నికలు జరిగేందుకు సహకరించాలన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు



చికెన్ దుకాణాదారుడికి జరిమానా విధిస్తున్న హెల్త్ అసిస్టెంట్ శివకుమార్

వనపర్తిటౌన్: వనపర్తి జిల్లా కేంద్రంలోని హోటళ్లు, చికెన్ షాపుల్లో బుధవారం మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్ శివకుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. బ్రహ్మంగారి ఆర్చి సమీపంలో ఉన్న చికెన్ దుకాణం అపరిశుభ్రంగా దుర్వాస వెదజల్లుతుండడంతో రూ.1,000, శ్రీ బాలజీ హోటల్ అపరిశుభ్రంగా ఉందని, వేస్ట్ ఫుడ్‌ని ఫ్రిజ్‌లో ఉంచినందుకు రూ.2,000 జరిమానా విధించారు. హోటళ్లు, చికెన్ సెంటర్‌లో తనిఖీలో భాగంగా రూ.2,500, మాడ్రన్ బేకరీలో వేస్ట్‌ఫుడ్, ప్లాస్టిక్ కవర్లు వాడుతున్నందుకు రూ.1,000 జరిమానా విధించారు. మొత్తం రూ.6,500 జరిమానా విధించినట్లు వెల్లడించారు. మొదటి హెచ్చరికగా కేవలం జరిమానా విధించి వదిలేస్తున్నామని, నిబంధనలు తప్పితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తడిపొడి వ్యర్థాలపై అవగాహన

తడి పొడి వ్యర్థాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర్‌లు అన్నారు. 100 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా కేంద్రంలోని 17,1,4,18,16,22,26,32వ, వార్డుల్లో తడి, పొడి వ్యర్థాల విభజ, ఏబీసీ ప్రచారం, వీధి, పెంపుడు కుక్కలు, డెంగీ, మలేరియాపై అవగాహన కల్పించారు. పలు కాలనీల్లో డ్రెయినేజీలో మురుగును దగ్గరుండి తీయించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ ఉమా మహేశ్వర్ రెడ్డి, డీఎంసీ బాలరాజు, సూపర్ వైజర్, వార్డ్ ఆఫీసర్స్, మున్సిపల్ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

విజిలెన్స్ కమిటీ సభ్యులకు సన్మానం



నూతనంగా ఎన్నికైన విజిలెన్స్ కమిటీ సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని టీ ఎన్‌జీఓ భవనంలో మాదిగ ఉద్యో గుల సమైక్య జిల్లా కమిటీ అధ్యక్షులు బోరెల్లి వెంకటయ్య అధ్యక్షతన బుధవారం నూతనంగా ఎ న్నికైన జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ ఆండ్ విజిలెన్స్ కమిటీ సభ్యులు విశ్వంబాబు, వెంకటేష్, డి.వెంకటేష్‌లను పూలమాల శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్య క్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏఐఎంఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు గద్వాల కృష్ణ మాట్లాడారు. జిల్లాలోని 15 మండలాల్లో ఎస్సీ, ఎస్టీల సమగ్ర అభివృద్ధి, వారి ఆత్మగౌరవాన్ని అన్ని రంగాల్లో పెంపొందించే విధంగా కృషి చేయాలని నూతన సభ్యులకు సూచించారు. సివిల్ రైట్స్ డే అన్ని మండలాల్లో అధికారులు నిర్వహించేందుకు దేవాలయాల్లోకి ప్రవేశాలు లేని గ్రామాల్లో ప్రజలను చైతన్య పరచి అందరం సమానమనే భావన కలిగించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ సీనియర్ నాయకులు గొర్ల బలరాం, గంధం గట్టయ్య, తగువుల వెంకటస్వా మి, కేశవులు, ఎంఈఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తగువుల కుమార్, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలి

వనపర్తి రూరల్: గొర్రెల, మేకల పెంపకందారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కిల్లె గోపాల్, కార్యదర్శి ఉడత రవీందర్ డిమాండ్ చేశారు. జిల్లా గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వం గొర్ల కాపరులకు గొర్రెలు ఇస్తామని, రెండో దశలో డీడీలు కట్టించుకొని నేటికీ చాలా గ్రామాల్లో డీడీల డబ్బులు తిరిగి చెల్లించలేదన్నారు. ప్రతి గ్రామంలో గొర్ల కాపరులకు షెడ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వనపర్తి జిల్లా కన్వీనింగ్ కమిటీని 11 మందితో ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కన్వీనర్‌గా ఓడె బాలరాజు, కో కన్వీనర్‌గా రమేష్, బాలపీర్, జిలా కమిటీ సభ్యులుగా రవి, వెంకటయ్య, ఆంజనేయుడు, వెంకటస్వామి, లక్ష్మి, భగవంతు, విజయ్‌కుమార్‌లను ఎన్నుకున్నారు.

సమ్మె నోటీసు అందజేత

వనపర్తి రూరల్: దేశవ్యాప్తంగా జూలై 9న చేపట్టే సమ్మెలో కార్మికులు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు పిలుపునిచ్చారు. బుధవారం తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని డీడబ్ల్యూఓ కార్యాలయంలో డీడబ్ల్యూఓ సుధారాణికి కార్మికులతో కలిసి సమ్మె నోటీసు అందజేసి మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లకు రూ.32 వేలు, హెల్పర్లకు రూ.26 వేలు వేతనం చెల్లించాలని, వారిని 29 కార్మిక చట్టాల పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసి 29 చట్టాలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు శారద, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు, జ్యోతి, సుమతి, కృష్ణవేణి, భాగ్య పాల్గొన్నారు.